RNI:APTEL/2023/87729



# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



అనకాపల్లి | సంపుటి: 2 | సంచిక: 115 | శుక్రవారం | 20-9-2024 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 4 | వెల : 3.00

## అన్నా క్యాంటీన్ ప్రారంభించిన పంచకర్ల



పెందుర్తి పెన్ సత్తా సెప్టెంబర్ 19: వేపగుంట జంక్షన్‌లో అన్న కాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్న జనసేన ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. గురువారం ఈ కార్యక్ర మంలో రమేష్ బాబు తో పాటు పెందుర్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి, స్థానిక కార్పొరేటర్ బల్లా శ్రీనివాస రావు, 97 వ వార్డు కార్పొరేటర్ వసంత శంకర్రావు, జోనల్ 8 కమిషనర్ హైమావతి, పెందుర్తి నియోజకవర్గం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హి సేవా స్ఫూర్తితో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు






అనకాపల్లి పెన్ సత్తా సెప్టెంబర్ 19: స్వచ్ఛత హి సేవా స్ఫూర్తితో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. స్వచ్ఛత హి సేవ2024 కార్యక్ర మంలో భాగంగా మూడవరోజు నాతవరం మండలంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేయడం జరిగింది.

## ఉత్తమ కళాశాలగా డివిఎన్ గుర్తింపు



అనకాపల్లి పెన్ సత్తా సెప్టెంబర్ 19: స్థానిక దాడి వీరునాయుడు కళాశాలకు కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటీన్సిస్ (సిఎస్ సి) నుండి అత్యుత్తమ పురస్కారం లభించింది. ఈ పురస్కారం ప్రతి సంవత్సరం సర్ మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జన్మదిన సందర్భంగా అందజేస్తారు. ఈ పురస్కారం లభించినందుకు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లా డుతూ విద్యార్థులకు ఉత్తమ విద్యను, ఉత్తమ నైపుణ్యాలను, ప్రాంగణ నియామకాలు అందజేస్తున్న సంస్థకు ఈ అవార్డు అందజేస్తారన్నారు. ఈ పురస్కారాలను రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సంస్థలకు మాత్రమే అందించబడుతున్నాయన్నారు. ఈ కోవకు దాడి వీరునాయుడు కళాశాల అభివృద్ధి చెందడం ఎంతో ప్రతిష్టాత్మకము, హర్షనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వైస్ దయా మాధురి, సి. యస్. సి అధికారి వై. రామ్మోహన్ రావు, ఎస్ ఆర్ జమీర్, పాల్గొన్నారు.

## స్మశాన వాటికలో మొక్కలు నాటిన రౌతు



పరవాడ పెన్ పవర్ సెప్టెంబర్ 19: 79 వ వార్డు పరిధి లంకెలపాలెం ఏలేరు కెనాల్ దగ్గర గల స్మశాన వాటిక లో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా పనిచేయాలని, ఫార్మా కాలుష్యాన్ని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్రం రాజు, గుర్రం బాబురావు, గుర్రం శివ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్యాటక అవార్డుల కొరకు జిల్లా నుండి దరఖాస్తుల స్వీకరణ

### - దరఖాస్తులకు చివరి తేదీ 22-9-24 జిల్లా పర్యాటక అధికారి ఎస్వీఎస్ సుబ్బలక్ష్మి

అనకాపల్లి పెన్ సత్తా సెప్టెంబర్ 19: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27 న నిర్వహించే కార్యక్రమంలో అవార్డుల ప్రధానం కొరకై 2023- 24 సంవత్సరానికి అర్హులైన పర్యాటక రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి ఎస్వీఎస్ సుబ్బలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తులను టూరిజం వెబ్సైట్ %షఙఙ.ఖజ్ఞశీబతీఱం.ఎ.స్త్రశీజ.ఱఅ% నుంచి డౌన్లోడ్ చేసుకుని పూర్తి చేసిన తర్వాత ఎపి టూరిజం అథారిటీ, 5 వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాకు ఈ నెల 22 లోగా అందజేయాలని కోరారు. ఉత్తమ హెూటల్ (5 స్టార్, డీలక్స్), ఉత్తమ హెూటల్ (5 స్టార్, 4 స్టార్, 3 స్టార్), ఉత్తమ బడ్జెట్ హెూటల్, బెస్ట్ వే సైడ్ ఎమినిటీస్, ఉత్తమ హరిత హెూటల్, ఉత్తమ పర్యావరణ అనుకూల హెూటల్, ఉత్తమ థీమ్ ఆధారిత రిసార్ట్, హెూటల్లోని ఉత్తమ రెస్టారెంట్, ఉత్తమ థీమ్ రెస్టారెంట్, ఉత్తమ స్టాండ్-అలోన్ రెస్టారెంట్, ఉత్తమ చెఫ్, ఉత్తమ చెఫ్ (ఆంధ్రా వంటకాలు), ఉత్తమ స్టాండ్-ఒంటరి కన్వెన్షన్ సెంటర్, బెస్ట్ యూనిక్ టూరిజం ప్రాజెక్టు, టూరిస్టు డెస్టినేషన్ ఉత్తమ పౌర నిర్వహణ (పట్టణ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలు), ఆంధ్రప్రదేశ్ లో పర్యాటకాన్ని ప్రోత్సహించే ఉత్తమ జిల్లా (కలెక్టర్), ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ బీచ్, ఉత్తమ టూరిస్ట్ ఫ్రెండ్లీ రైల్వే స్టేషన్, సినిమా షూటింగ్ ఉత్తమ స్థానం, ఉత్తమ పర్యాటక అనుకూల విమానాశ్రయం, బెస్ట్ టూరిస్టు ఫ్రెండ్లీ బస్ స్టాండ్, స్థానిక పర్యాటక ప్రాజెక్టులు, టూరిజం ప్రాజెక్టు ఉత్తమ సమగ్ర అభివృద్ధి, ఉత్తమ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్, ఉత్తమ ట్రావెల్ ఏజెంట్, ఉత్తమ ట్రావెల్ ఏజెంట్ (బోటింగ్), ల్యాండ్, ఏరో, వాటర్ స్పోర్ట్స్ కోసం బెస్ట్ అడ్వెంచర్ ఇన్బౌండ్ టూర్ ఆపరేటర్ (డొమెస్టిక్), అత్యంత వినూత్నమైన ఇన్బౌండ్ టూర్ ఆపరేటర్ (దేశీయ), టూరిజాన్ని ప్రమోట్ చేస్తున్న బెస్ట్ ఎమర్జింగ్ ట్రావెల్ కంపెనీ, ఉత్తమ పర్యాటక విద్యా సంస్థ, రచన/ప్రచురణలో శ్రేష్టత, ఉత్తమ టూరిస్ట్ గైడ్, ఏపీ టూరిజంపై ఉత్తమ చిత్రం, ఉత్తమ పర్యాటక ప్రమోషన్ కొలేటరల్ పబ్లిసిటీ మెటీరియల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యొక్క అత్యంత వినూత్న వినియోగం/ఉత్తమ టూరిజం వెబ్సైట్/పోర్టల్ ప్రమోటింగ్, ఆంధ్రప్రదేశ్ కళ, సంస్కృతి ద్వారా పర్యాటక ప్రచారం, ఎపి టూరిజాన్ని ప్రోత్సహించే ఉత్తమ బ్లాగర్/సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ విభాగాలకు అవార్డులు అందజేయనున్నట్లు వివరించారు.

## 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో అనుకున్న లక్ష్యాలను సాధించాలి

### - జాయింట్ కలెక్టర్ జాహ్నవి



అనకాపల్లి పెన్ సత్తా సెప్టెంబరు 19: జిల్లాలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో అనుకున్న లక్ష్యాలను సాధించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఎమ్. జాహ్నవి ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎమ్. జాహ్నవి పాల్గొన్నారు. జిల్లాలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో వివిధ శాఖల లక్ష్య సాధనలో పురోగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్దేశిత లక్ష్యాలు సాధించడంలో వివిధ శాఖలు పురోగతి సాధించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా కొన్ని శాఖల పనితీరు మెరుగుపరుచుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 20 వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అన్ని శాఖల అధికారులు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో సిపిఓ రామారావు, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ బాలాజీ, వ్యవసాయ, హార్టికల్చర్, సెరికల్చర్, డిఆర్డిఏ, పశుసంవర్ధక, మత్స్య, డ్వామా, మెప్మా, మైన్స్ అండ్ జియాలజీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, విద్యా, ఫారెస్ట్ శాఖల అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ సింహాద్రి లో జిప్సం ఉత్పత్తి ప్రారంభం






పరవాడ పెన్ సత్తా సెప్టెంబర్ 19: ఎన్టీపీసీ సింహాద్రి లో పర్యావరణ పరిరక్షణ ప్రోత్సహించడం మే లక్ష్యంగా జిప్సం ఉత్పత్తిని ప్రారంభించింది. పారిశ్రామిక, వ్యవసాయ అవసరాలకు మద్దతుగా ఎన్టీపీసీ బూడిద నుంచి (ఫ్లై యాష్) జిప్సం ఉత్పత్తిని ప్రారంభించింది. ఈ సందర్భంగా గురువారం సంజయ్ కుమార్ సిన్హా, చీఫ్ జనరల్ మేనేజర్ (సింహాద్రి) ప్లాంట్ ఆవరణలో జిప్సం తొలి విక్రయ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ సంస్థ యొక్క గ్రీన్ ఎనర్జీ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. ఈ పురోగతి ఎన్టీపీసీ సింహాద్రి యొక్క ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్ జి డి) యూనిట్ల నుండి వచ్చింది, ఇవి సల్ఫర్ డయాక్సైడ్ (ఎస్ ఓ 2) ఉద్గారాలను తగ్గించడానికి రూపొందించబడ్డాయి అన్నారు. ఈ ఉద్గారాలను మార్చడం ద్వారా ఈ జిప్సం సిమెంట్, వ్యవసాయం వంటి పరిశ్రమలలో ఉపయోగించే విధంగా తయారు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం వెలువడుతున్న పర్యావరణ ముప్పును సింహాద్రి విజయవంతంగా నిలువరించే విధంగా మార్చిందన్నారు. జిప్సం ఉత్పత్తి పారిశ్రామిక డిమాండ్ కనుగుణంగా మాత్రమే కాకుండా హానికరమైన ఉద్గారాల ప్రభావాన్ని పర్యావరణం పై తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. అందులో భాగంగా గ్రీన్ ఎనర్జీ కోసం ఎన్టీపీసీ సింహాద్రి అంకితభావాన్ని సిన్హా పునరుద్ఘాటిస్తూ మేము మా కార్యకలాపాలను మరింత పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన, ఉత్పత్తిని అభివృద్ధి చేయడానికి కట్టుబడి వున్నామన్నారు. ఎఫ్ జి డి యూనిట్ల నుండి జిప్సం ఉత్పత్తి లక్ష్యం వైపు ఒక ప్రధానమైన అడుగు వేయడం జరిగింది అని దాని వలన పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడమే కాకుండా సంస్థకు ఆర్థిక విలువకు దోహదం చేస్తుందన్నారు. ఈ ఉప ఉత్పత్తిని ఉపయోగించడానికి ఆసక్తిగా ఉన్న అనేక పరిశ్రమల నుండి జిప్సమ్‌కు బలమైన డిమాండ్ ఉందన్నారు. ఇంధన రంగంలో స్థిరమైన పద్ధతులకు పెరుగుతున్న గుర్తింపును నొక్కి చెబుతుందన్నారు. వ్యర్థ పదార్థాల నుండి పర్యావరణాన్ని రక్షించడంలో ??ఇతర పవర్ ప్లాంట్‌లకు ఎన్టిపిసి సింహాద్రి ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌కె దేవిడ్, జనరల్ మేనేజర్ (ఓ అండ్ ఎం), ఎస్ పద్మప్రియ, జనరల్ మేనేజర్ (టిఎస్), ఇతర విభాగాధిపతులు, సీనియర్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు పెట్టడం పై హర్షం వ్యక్తం చేసిన ఎంపీ రమేష్



అనకాపల్లి పెన్ సత్తా సెప్టెంబర్ 19: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును ఖరారు చేస్తూ క్యాబినెట్ ఆమోదముద్ర వేసిన నేపథ్యంలో అనకాపల్లి ఎం.పీ సీ.ఎం రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం ఆ మహానుభావునికి మనం సమర్పించుకునే ఘన నివాళి అని, ఆయన కీర్తిని ప్రపంచం నలు వైపులా వ్యాప్తి చేసే చక్కని నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అని పేర్కొన్నారు. చిన్న వయసు లోనే స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ పాలకులను ఎదిరించి తెల్ల దొరల తూటాలకు నేల కొరిగిన ఒక మహావీరుడిని ఈ రకంగా స్మరించుకోవడం మన తెలుగు జాతి అదృష్టం అని, ప్రతి ఒక్కరు గర్వించదగ్గ అంశం అని తెలిపారు. దాదాపు 2,200 ఎకరాల్లో తొలి విడతతో భాగంగా రూ.4,502 కోట్లతో విమానాశ్రయ పనులు జరుగుతున్నాయి అని ఇటీవలే మన కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు సైతం 2026 జూన్ నాటికి పనులు పూర్తి చేయడమే లక్ష్యం అని తెలియజేసారన్నారు. స్వాతంత్ర సమరయోధులు, దేశం గర్వించదగ్గ మహానుభావుల పేర్లను పథకాలకు పెట్టడంతో ఒక మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం తీసుకున్న మరో ఉన్నతమైన నిర్ణయం అని తెలియజేసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, కేబినెట్ మంత్రి వర్గం కు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. వెనకబడిన ఉత్తరాంధ్రకు ఎయిర్ పోర్టు గ్రోత్ ఇంజన్ కాబోతోంది అని కూటమి ప్రభుత్వంలో అంతర్జాతీయ స్థాయిలో మన ప్రాంతానికి ఉన్నతమైన గుర్తింపు, గౌరవం లభిస్తుందని ఆకాంక్షించారు.

# గోవాడ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు ఆందోళన





**- కార్మికులను పట్టించుకోలేదని ఆవేదన**
**- జీతాలు, పిఎఫ్, బోనస్సు కోసం ధర్నా**

చోడవరం పెన్ సత్తా సెప్టెంబర్19: చోడవరం చక్కెర కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులు గురువారం ఆందోళన జరిపారు. ఫ్యాక్టరీ గెస్ట్ హౌస్ వద్ద కార్మికులు ధర్నా చేసి బకాయి ఉన్న జీతాలు, ఓటీలు, 10 శాతం బోనస్ చెల్లించాలని ముఖ్యంగా పిఎఫ్ సొమ్ము జమ చేయకపోవడం చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కేవివిఎస్ భాస్కరరావు ఆధ్వర్యంలో కార్మికులు కదం తొక్కారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ..... ఇస్తున్న జీతాలు తక్కువగా ఉన్నాయని అవి కూడా ఇవ్వటం లేదని, గత సీజన్లో ఉన్న ఓటి బిల్లులు చెల్లించలేదని, 6 నెలలు నుండి పీఎఫ్ సొమ్ము జమ చేయలేదని దీనివలన ఏ కార్మికునికైనా ఇబ్బంది ఎదురైతే భీమా సొమ్ము రాదని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా 6 నెలలు కార్మికులను విధులకు పిలవలేదని దీనివలన కార్మికులు అప్పుల ఊపులో కూరికి పోయారని ఇప్పటికైనా జీతాలు చెల్లించి, పీఎఫ్ బకాయిలు జమ చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**ఇది చాలా అన్యాయం.... జనసేన పార్టీ రాజు**

అదే సమయంలో జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్చార్జి పి.వీ.ఎస్.ఎన్ రాజు ఫ్యాక్టరీకి రావడంతో కార్మికుల ఆందోళన చూసి బాధపడి తాము కూడా మద్దతు ఇస్తామని తెలిపారు. ఫ్యాక్టరీ వలన రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలుసునని, కానీ కార్మికులు కూడా డ్యూటీలు లేక, జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలియదని దీనిపై ఫ్యాక్టరీ పర్సనల్ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్కు తెలియజేస్తానని పేర్కొన్నారు. అలాగే పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి కార్మికుల సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో అక్కడ ఉన్న కార్మికులందరూ ఆయనకు ధన్యవాదములు తెలిపారు. అనంతరం ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వివిఎస్ నాయుడు మాట్లాడుతూ.... కార్మికులకు త్వరలో పేమెంట్లు చేస్తానని హామీ ఇచ్చారు. కాగా, పి.వీ.ఎస్.ఎన్.రాజు వెంట గూనూరు మూలునాయుడు, కర్రి రమేష్, పీలా మహేష్, దాడి వెంకట అప్పారావు తదితరులు పాల్గొనగా, కార్మికుల ఆందోళనలో యూనియన్ నాయకులు ఏడువాక నారాయణరావు, అల్లం రామ అప్పారావు, రాపేటి జగన్నాధరావు, రాజుల సంతోష్, కె.వి. రామారావు, దుస్సు వెంకటరమణ, వసాది రమణ, ఎస్.హరికుమార్, గుమ్మాల త్రినాథ్, కసిరెడ్డి సురేష్ భారీగా కార్మికులు పాల్గొన్నారు.

# టన్నుకు రూ 3500 ఇవ్వాలి

**- జనసేన పార్టీ పి.వీ.ఎస్.ఎన్ రాజు**



చోడవరం పెన్ సత్తా సెప్టెంబర్19: రానున్న సీజన్ కు చోడవరం చక్కెర కర్మాగారం ఫ్యాక్టరీ సభ్య రైతులకు టన్నుకు రూ 3500 చొప్పున ఇవ్వాలని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్చార్జ్ పి.వీ.ఎస్.ఎన్ రాజు అన్నారు. ఈ మేరకు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వివిఎస్ నాయుడును ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.వీ.ఎస్.ఎన్ రాజు మాట్లాడుతూ.... రైతులకు చెరుకు మద్దతు ధర గిట్టుబాటు కావడం లేదని అందువలనే చెరుకు సాగు తగ్గించారని, రైతుల బకాయిలు చెల్లించకపోవడం కూడా చెరకు సాగు తగ్గడానికి ఒక కారణమని, అలాగే ఫ్యాక్టరీని నమ్ముకున్న కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం చాలా దారుణమని ఈ విషయం పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, ఫ్యాక్టరీ చైర్మన్గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ ను కలిసి సమస్య పరిష్కరించి రైతులను, కార్మికులను ఆదుకోవాలని విన్నవిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జనసేన నాయకులు అల్లం రామ అప్పారావు, గూనూరు మూలునాయుడు, కర్రి రమేష్, పీలా మహేష్, దాడి వెంకట అప్పారావు, డి.ఎస్ నాయుడు, మైచర్ల నాయుడు, ఆడారి రమణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# చోడవరం లడ్డూ రూ 20 వేలు



చోడవరం పెన్ సత్తా సెప్టెంబర్16: స్థానిక స్వయంభూ శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయంలోని స్వామి ప్రసాదం లడ్డును రూ 20 వేలకు వైసీపీకి చెందిన శరగడం సిమ్మినాయుడు కైవసం చేసుకున్నారు. ప్రతి ఏడాది వలే స్థానిక శ్రీవెంకటేశ్వర స్వీట్ స్టాల్ యజమానులు అడపా శ్రీనివాసరావు, అడపా రాధాకృష్ణ రమారమి 40 కిలోల లడ్డూ తయారుచేసి గణనాధుని ఆలయానికి ఇవ్వగా నవరాత్రి 9 రోజులు స్వామి వద్ద ఉంచి పూజలు జరిపారు. గతంలో ప్రతి ఏడాది లడ్డు వేలం వేసేవారు. కోవిడ్ సమయంలో ఎవరు ముందుకు రాకపోవడంతో అప్పటినుండి సిమ్మినాయుడు తీసుకొని నిర్వాహకులు చెప్పిన సొమ్మును ఇస్తున్నారు. గత ఏడాది రూ 15 వేలు ఇవ్వగా, ఈ ఏడాది రూ 20 వేలు ఇస్తామన్నారు. ఆ సొమ్మును ఈనెల 22న ఆదివారం జరగనున్న స్వామి అన్న సమారాధన కొరకు వినియోగిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి తెలిపారు. స్వామి ప్రసాదంను సిమ్మినాయుడు తీసుకొని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి శ్రీనివాస్, సిడిసి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబశివరావు, పలువులు కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ ఈవో ఎస్.వి.వి సత్యనారాయణ మూర్తి, శంకర్ భక్తులు పాల్గొన్నారు.

# దక్షిణ నియోజకవర్గంలో అన్న క్యాంటీన్‌లు ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపీ





**- కేజీహెచ్, టర్నల్ చౌల్ట్రి, ఫ్రూట్ మార్కెట్ ప్రాంతాల్లో ప్రారంభం - పండుగ వాతావరణంలా కార్యక్రమంలో పాల్గొన్న కూటమి శ్రేణులు**

విశాఖపట్నం పెన్ సత్తా సెప్టెంబర్ 19: దక్షిణ నియోజకవర్గం లో కేజీహెచ్, టర్నల్ చౌల్ట్రి, ఫ్రూట్ మార్కెట్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ లను విశాఖ ఎంపీ భరత్, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ సౌత్ ఇన్చార్జి సుధాకర్ లు ముఖ్య అతిదులుగా పాల్గొన ప్రారంభించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కూటమి నేతలతో కలసి పలువురికి స్వయంగా వడ్డించి, వారితో కలిసి భోంచేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం 5 రూపాయలకు అందించే క్యాంటీన్లు ప్రారంభించడం గొప్ప విషయం అని అన్నారు. ఈ క్యాంటీన్లను పేదలకు అవసరమైన ప్రదేశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ప్రతి హామీ నెరవేర్చడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కూటమి శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# క్రీడల వల్ల మానసిక, శారీరిక దృఢత్వంతో పాటు ఏకాగ్రత కలుగుతుంది - బైలపూడి





అచ్చుతాపురం పెన్ సత్తా సెప్టెంబర్ 19 : క్రీడల వల్ల మానసిక ప్రసాంతతో తోపాటు ఏకాగ్రత, శరీర దృఢత్వం కలుగుతుందని బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శీను అన్నారు. గురువారం వీరు జిల్లా పరిషత్ పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చుతాపురం మండలం క్రీడలకు ప్రసిద్ధిగా నిలిచిందన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ అచ్చుతాపురానికి పేరు ప్రఖ్యాతలు జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, దేశ స్థాయిలో తేవాలి అని క్రీడాకారులకు సూచించారు. క్రీడలతో పాటు చదువు పై ఆసక్తి చూపించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కే చిన్నారావు, ద్వారపురెడ్డి బాబ్జి, ఈ నాయుడు బాబు డ్రీమ్స్, ప్రధానోపాధ్యాయులు, పిఈటిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా రెండు కస్తూరిబా పాఠశాలలు మంజూరు

**- వడ్డాది, జె.నాయుడుపాలెం గ్రామాల్లో - అడ్మిషన్లు ప్రారంభం.... ఎమ్మెల్యే రాజు**



చోడవరం పెన్ సత్తా సెప్టెంబర్19: హైస్కూలు చదువుకుంటున్న బాలికలు ఇబ్బంది పడకుండా చోడవరం నియోజకవర్గానికి మరో రెండు కస్తూరిబా బాలికల వసతి గృహాలు మంజూరు చేయించామని, గాంధీ జయంతి రోజున ప్రారంభం అవుతాయని అడ్మిషన్లు కూడా తీసుకుంటున్నారని చోడవరం ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... నియోజకవర్గంలోని బుచ్చియ్యపేట మండలం వడ్డాదిలోను, రోలుగుంట మండలం జె.నాయుడుపాలెం గ్రామంలోని అప్పట్లో తాము కస్తూరిబా పాఠశాలలు రప్పించి భవనాలు కూడా నిర్మాణం చేయించామని ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ఆ పనులు ముందుకు వెళ్లలేదని ఇప్పుడు కూటమీ ప్రభుత్వం రావడంతో ఆ రెండు కస్తూర్బా పాఠశాలల్లో సిబ్బందిని నియమించి గాంధీ జయంతి రోజున ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని ఆయా ప్రాంతాల్లో ఉన్న హైస్కూల్ బాలికలు కొత్తగా వచ్చిన కస్తూరిబా బాలికల వసతి గృహంలో జాయిన్ కావడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే పాలిటెక్నికల్ కళాశాల, జ్యోతిరావు పూలే పాఠశాల భవనాలు చోడవరం లోనే ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని వైసిపి హయాంలో వెంకన్నపాలెం, జన్నవరం గ్రామాల్లో స్థలాలు కేటాయించడంతో అంత దూరం వెళ్లడానికి విద్యార్థులు ఇష్టపడడం లేదని, తల్లిదండ్రులకు ఆసక్తి లేదని అందువలన చోడవరంలోనే భవనాలు నిర్మాణం చేయించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న రెవెన్యూ కార్యాలయ భవనం, రైతు బజారు భవనాలు పూర్తిచేయిస్తామని, అలాగే చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకలు నుండి 50 పడకలుగా అప్ గ్రేడ్ చేయిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు, మాజీ జడ్పిటిసి కనిశెట్టి మచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు అలవాటు కాకుండా మంచి మార్గంలో నడవాలి - ఎస్ఐ కె సావిత్రి



ఎలమంచిలి పెన్ సత్తా సెప్టెంబర్ 19: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం, కొక్కిరాపల్లిలో విద్యార్థులకు సమాజంలో విద్యార్థుల నడవడిక పై ప్రేరణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా యలమంచిలి టౌన్ ఎస్ఐ కె సావిత్రి పాల్గొని కార్యమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె సావిత్రి మాట్లాడుతూ ప్రస్తుత రోజులలో యువతలో వచ్చిన మార్పులు, అమ్మాయిల పై జరుగుతున్న ఘోరాలు, వాటిని ఎలా ఎదురోవాలి అనే ఆశాల పై అవగాహన కల్పించారు. యువత ఆన్లైన్ మోసాలు, నుండి ఎలా బయట పడాలి, చెడు వ్యసనాలకు ప్రభావితమై వాటికి అలవాటు కాకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. అమ్మాయిల పై అఘాయిత్యాలు జరిగినట్లు పోలీసుల దృష్టికి వచ్చినట్లయితే నిర్భయ చట్టం ద్వారా శిక్ష పడుతుందని అన్నారు. అనంతరం ప్రిన్సిపల్ మాణిక్యం మాట్లాడుతూ గురుకుల పాఠశాల నుండి 5 గురు విద్యార్థినులు 49 వ రాష్ట్ర యోగాసన క్రీడా ఛాంపియన్‌షిప్ -2024 పోటిల్లో పాల్గొనడం జరిగిందని అన్నారు. రాష్ట్ర స్థాయిలో పాఠశాలకి 3 వ స్థానం లభించిందని ఆమె తెలిపారు. పాల్గొన్న 15 మంది విద్యార్థినులలో ముగ్గురు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షణ ఇచ్చిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగ గురువు ఎం. రాముని, ప్రిన్సిపల్ సత్కరించారు. అదేవిధంగా యోగాలో నిరంతర సాధన చేయిస్తున్న కళాశాల పిడి, ఆర్ ఇటి రమాదేవి, విజయ కుమారిని అభినందించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సులభంగా ఇసుక బుకింగ్ విధానం కలెక్టర్ విజయ కృష్ణన్





**- ఏ.పి సాండ్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్ ద్వారా ఇసుక సరఫరా - రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు కావాల్సినంత ఇసుక ఉచితంగా ఇవ్వడానికి అందుబాటులో ఉంచింది**

అనకాపల్లి పెన్ సత్తా సెప్టెంబర్ 19: రాష్ట్ర ప్రజలు ఉచితంగా ఇసుకను బుక్ చేసుకోవడంతో పాటు ఇసుక సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏ.పి శాండ్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్ ను ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం ఏ.పి శాండ్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్ ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆన్లైన్ లేదా గ్రామ వార్డ్ సచివాలయంలో ఇసుకను ఉదయం 10.30 నుంచి 5–00 గంటల వరకు బుకింగ్ ఆర్డర్ తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వర్చువల్ కాన్ఫరెన్స్ లో అనకాపల్లి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, మైన్స్ అండ్ జియాలజీ శాఖ, జిల్లా పంచాయతీ అధికారి, డిస్టిక్ శాండ్ కమిటీ మెంబర్లతో పాటు ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇసుక వినియోగదారులకు సూచనలు, ఇసుక రవాణా వాహనదారులకు సూచనలకు సంబంధించిన గోడ పత్రికను (పోస్టర్స్)జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మీకు ఉచితంగా ఇసుక ఇవ్వడమే కాదు, మీరు కోరుకుంటే ఆ ఇసుకను మీ ఇంటివద్దకే డెలివరీ చేసే సదుపాయం కూడా అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఇందు కొరకు మీరు కేవలం రవాణా, నిర్వహణ ఖర్చులను మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉచితంగా ఇసుక పొందడానికి ప్రజల సౌకర్యార్థం గనులు మరియు భూగర్భ శాఖ, ఆంధ్రప్రదేశ్ వారిచే ప్రత్యేకంగా ఏపీ శాండ్ పోర్టల్ (%ట్ప్జూం://షష.ఝఅస.ఖజూ.స్త్రశీజ.ఱఅ%/) వెబ్ సైట్ రూపొందించబడిందన్నారు. ఇసుక అవసరమైన వారు ముందుగా ఈ పోర్టల్లో లాగిన్ అవ్వాలి అని, లాగిన్ అయ్యాక అందులో మీ ప్రాజెక్టు సైట్, నిర్మాణ సైట్ లొకేషన్ వివరాలు, జీపీఎస్ కో ఆర్డినెట్స్ ని పొందుపరచాలి అన్నారు. మీరు పొందుపరచిన వివరాల ప్రకారం మీకు అవసరమైనంత ఇసుకను మీకు దగ్గర్లోని ఏ ఇసుక సరఫరా కేంద్రం నుంచి అయినా పొందేలా అనుమతి ఇస్తారన్నారు. మీరు ఆన్లైన్లో ఇసుక కోసం ఆర్డర్ బుక్ చేసుకున్న 1 లేదా 2 పని దినాలలో ఇసుకను వినియోగదారు ఇంటికే సరఫరా చేస్తారన్నారు. వినియోగదారు కోరుకుంటే మీరు ఆర్డర్ చేసిన ఇసుకను మీ ఇంటి వద్దకే రవాణ చేస్తారు. అయితే ఇసుక సరఫరా కేంద్రం నుండి మీ ఇంటి మధ్య దూరానికి సంబంధించిన రవాణ చార్జీలను వినియోగదారు భరించాల్సి ఉంటుందన్నారు. ఒక వేళ వినియోగదారు ఆర్డర్ చేసిన ఇసుకను వారి సొంత వాహనం లో అయినా, వారు ఏర్పాటు చేసుకున్న వాహనంలో కూడా తీసుకుని వెళ్లొచ్చు అని, అయితే ఆ వాహనం తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గనులు, భూగర్భ శాఖ రిజిస్టర్ లో నమోదై ఉండాలన్నారు. ఇసుకను ప్రభుత్వ పని దినాలలో మాత్రమే ఇసుక ఆర్డర్ చేసుకోగలరు అని, పనిదినాలలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుక పోర్టల్లో ఆర్డర్ చేయడానికి అనుమతి ఉంటుందన్నారు. ఒకవేళ వినియోగదారులు సొంతంగా ఇసుకను ఆర్డర్ చేసుకోవడం రాకపోతే వారు మీ దగ్గర లో ఉన్న గ్రామ వార్డు సచివాలయంలో ఇసుకను ఆర్డర్ చేయవచ్చు అని, ఉదయము 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ వార్డు సచివాలయాలలో ఇసుక బుకింగ్ ఆర్డర్స్ తీసుకోడం జరుగుతుందన్నారు. ఇసుక ఆర్డర్లకు నగదు రహిత ఆన్లైన్ పెమెంట్స్ మాత్రమే అంగీకరించబడతాయి అన్నారు. ఇసుక రవాణా చేసే వాహనదారులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఒక గొప్ప అవకాశం కల్పిస్తోందని, ఇసుక రీచ్ నుంచి వినియోగదారుల ఇంటి వద్దకే ఇసుకను రవాణా చేసి, ఆ రవాణా రుసుము ప్రభుత్వం నుంచి నేరుగా మీ ఖాతాలోకి జమ చేసే అవకాశాన్ని ప్రభుత్వం ఇప్పుడు కల్పిస్తోందన్నారు. దీనికోసం ట్రాక్టర్, 6, 10, 12, 14 చక్రాల లారీ యజమానులు, ఇసుక రవాణా చేసే వాహనదారులు ముందుగా తమ వాహనాన్ని గనులు, భూగర్భ శాఖ వారి ఆన్లైన్ పోర్టల్లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వాహనదారులు ముందుగా మీరు మీ జిల్లా లోని జిల్లా మైన్స్, జియాలజీ ఆఫీసర్ డి ఎం జి ఓ ని సంప్రదించి మీ వాహనం ద్వారా ఇసుక రవాణా చేయాలనే మీ ఆసక్తిని తెలియజేసి, మీ వాహనాన్ని జీపీఎస్ డివైస్ తో అనుసంధానం చేయాలి అన్నారు. ప్రత్యేకంగా ఇసుక వాహనాల రవాణా కొరకు తగిన సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి డి ఎం జి ఓ ని సమక్షంలో మీ వాహనానికి సంబంధించి సరైన పత్రాలు సమర్పించి ఎంపేనల్మెంట్ చేసుకోవాలన్నారు. వాహన యజమానులు తమ వాహనాల రిజిస్టర్ చేసుకోవడానికి ఎలాంటి పరిమితి లేదు అని, ఇసుక రవాణా చేయడానికి మీ వద్ద ఎన్ని వాహనాలున్నా వాటన్నిటిని నమోదు చేసుకోవచ్చు అని, అలాగే రాష్ట్రం లోని ఏ జిల్లాలో అయినా ఎన్ని వాహనాల నైనా సరే రిజిస్టర్ చేసుకోవచ్చు వీటిపైన ఎలాంటి పరిమితి లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ప్రకారం ఇసుక రవాణాకు సంబంధించి ఛార్జీలు నిర్ణయించబడ్డాయి. ఈ రవాణా చార్జీల పైన మరింత సమాచారం కోసం ఏపీ శాండ్ పోర్టల్ (%ట్ప్జూం://షష.ఝఅస.ఖజూ.స్త్రశీజ.ఱఅ%/) జిల్లా డి ఎం జి ఓ ని ని సంప్రదించాలి అన్నారు.మీ ఇసుక రవాణా వాహనం డెలివరీ కేటాయింపు చేసినప్పుడు మీ మొబైల్ యాప్ కి సందేశం వస్తుందని, మీరు ఆ ఇసుకను డెలివరీ చేయడానికి అంగీకరించినచో, ఆ ఇసుక ఏ ప్రాంతానికి, ఎవరికి డెలివరీ చేయాలి, ఎంత ఛార్జీలు, ఇసుక సరఫరా కేంద్రంకి మీ వాహనం ఏ సమయానికి రావాలి అనే విషయాలను తెలియజేయబడతాయి అన్నారు. అన్ని కేటాయింపులు కేవలం మొబైల్ యాప్ ద్వారా మాత్రమే జరుగుతాయి. వాహన యజమానులు ఇసుకను నిర్దేశిత చిరునామాకు విజయవంతంగా చేర వేసిన తరువాత 1, 2 పని దినాల లోనే వారికి రవాణా చేసిన ఇసుకకు సంబంధించిన రవాణా ఛార్జీలు (పన్నులు మినహాయించి) నేరుగా మీ బ్యాంకు ఖాతా లోకే జమ చేయబడుతుందన్నారు. వాహనాలు ఉదయం 6 గంటల నుండి కేటాయింపులు మొదలవుతాయి అని, ట్రాఫిక్ ఆంక్షలు ఉన్న నగరాల్లో మాత్రం రాత్రి 10 గంటల తర్వాత కేటాయింపులు జరుగుతాయి అని, ప్రభుత్వ సెలవు దినాలలో కేటాయింపులు జరగవు అని తెలియజేసారు.




## వాలీబాల్ లో గవరవరం స్కూల్ విద్యార్థుల ప్రతిభ



చోడవరం పెన్ సత్తా సెప్టెంబర్19: మండలంలోని పి ఎస్ పేట హై స్కూల్ వద్ద జరుగుతున్న స్కూల్ గేమ్స్ పోటీల్లో గవరవరం హైస్కూల్ విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. అండర్ 17 విభాగంలో విద్యార్థులు వాలీబాల్ ఆడి ప్రతిభ కనబరిచగా వారిని చోడవరం ఎంఈఓ సింహాచలం, గవరవరం హైస్కూల్ హెచ్ఎం జిజే సుందర్ సింగ్, పిడి మోహన్ నాగరాజు శ్రీను చిరంజీవి తదితరులు అభినందించారు.

## గాజుల అలంకరణలో దర్శనమిచ్చిన మరిడిమాంబ





అనకాపల్లి పెన్ సత్తా సెప్టెంబర్ 19: గవరపాలెంలో కొలువైన మరిడిమాంబ అమ్మవారి నెల పండుగ సందర్భంగా గురువారం అమ్మవారికి భక్తులు సహకారంతో గాజులతో అలంకరణ చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి క్యాలెండర్ ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు ఎల్లపు వెంకటరమణ, అధ్యక్షులు బిఎస్ యమ్ కె జోగి నాయుడు, కార్యదర్శి కాండ్రేగుల హరి కిషోర్, ఉపాధ్యక్షులు కే యం నాయుడు, కోశాధికారి కాండ్రేగుల శ్రీనివాసరావు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## మునగపాక లో ఫార్మా, సెజ్ కార్మికుల భద్రత కై సీపీఎం రక్షణ యాత్ర



మునగపాక పెన్ సత్తా సెప్టెంబర్ 19: ఫార్మా, సెజ్ లలో కార్మికులకు భద్రత కల్పించాలనే లక్ష్యంతో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కార్మికుల భద్రత పై రక్షణ యాత్ర గురువారం మునగపాక చేరుకున్నది. ఈ యాత్ర ఈనెల 20 వరకు జరుగుతుందని, 20న అత్యుతాపురంలో బహిరంగ సభ జరుగుతుందని దీనిని అందరూ జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కె. లోకనాధం మాట్లాడుతూ ప్రభుత్వ, యాజమాన్యాల నిర్లక్ష్యం తో ఇటీవల అచ్యుతాపురం ఎసెన్షియ ఫార్మా కంపెనీ ప్రమాదం లో 17 మంది కార్మికులు మరణించి, 40 మంది వరకు క్షతగాత్రులు అయ్యారన్నారు. ఈ నేపధ్యంలో జిల్లాలో వివిధ పరిశ్రమంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని, దీనికోసం ప్రభుత్వాలు, యాజమాన్యాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్తో ఈ రక్షణ యాత్ర జరుగుతోందని ఇందులో కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రద చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.వి శ్రీనివాసరావు, శంకరరావు, శివాజీ, నాయనబాబు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వరదల వల్ల ధ్వంసం అయిన రహదారులను యుద్ధ ప్రాతిపదికన పునర్నిర్మిస్తాం





**- వారం రోజుల్లోగా ఏలూరు గుడివాక లంక ప్రధాన రహదారి పనులు పూర్తి చేస్తాం - దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**

దెందులూరు పెన్ సత్తా సెప్టెంబర్ 19: భారీ వర్షాలు, ఆకస్మిక వరదల వల్ల దెందులూరు నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మత్తులు, పునర్నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం గుడివాక లంక గ్రామంలో దెబ్బతిన్న ప్రధాన రహదారులను గురువారం సాయంత్రం ప్రభుత్వ అధికారులు, స్థానిక కూటమి నాయకులతో కలిసి చింతమనేని పరిశీలించారు. దెబ్బతిన్న రహదారుల నిర్మాణాలు సత్వరమే పూర్తి చెయ్యాలని చింతమనేని ప్రభాకర్ ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ బుడమేరు, గుండేరు, తమ్మిలేరు, రామిలేరు వరద ప్రభావం వల్ల, భారీ వర్షాల వల్ల ఏర్పడిన ఉపద్రవంతో దెందులూరు నియోజకవర్గం లోని ఏలూరు, కైకలూరు, ఆర్ అండ్ బి రహదారి, ఏలూరు గుడివాక లంక ప్రధాన రహదార్లు భారీగా దెబ్బతిన్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు వరదల వల్ల దెబ్బతిన్న రహదారుల మరమ్మత్తులు, పునర్నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని అన్నారు. ఏలూరు గుడివాక లంక ప్రధాన రహదారికి రూ.60 లక్షల రూపాయలతో అంచనాలు సిద్ధం చేసి శుక్రవారం నుంచే పనులు ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే చింతమనేని తెలిపారు. సత్వరమే రహదారుల పనులు పూర్తి చేసి లంక గ్రామాల ప్రజలకు ఏలాంటి ఇబ్బంది లేకుండా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని చింతమనేని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల పార్టీ అధ్యక్షులు నంబూరి నాగరాజు, కొల్లేరు నాయకులు సైదు సత్యనారాయణ, అర్ %�డ%బి సూపరింటెండెంట్ ఇంజినీర్ జాన్ మోషే, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిషోర్ బాబ్జీ, ఎమ్మార్వో, ఎంపీడీఓ సహా పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇక ఎకో సిస్టమ్‌కు హెల్త్‌కార్డులు

**- చిత్తడి నేలలు, అడవుల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు - ఎన్‌సీఎస్‌సీఎం డైరెక్టర్ డా.రామచంద్రన్ వెల్లడి**



విశాఖపట్నం: అటవీ వ్యవస్థను సంరక్షిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా దేశవ్యాప్తంగా ఎకోసిస్టమ్‌కు హెల్త్‌కార్డులు నిర్వహించే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డా.పూర్వాజ రామచంద్రన్ తెలిపారు. ఇండియన్ కౌ న్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ ఎడ్యుకేషన్, ఎన్‌సీఎస్‌సీఎం సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రిపరేషన్ ఆఫ్ ఎకోసిస్టమ్ హెల్త్‌కార్డు' పేరుతో విశాఖలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మూడు రోజుల సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన డా.రామచంద్రన్ మాట్లాడుతూ పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అటవీ సమస్యలను పరిష్కరిం చేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తూ ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న అటవీ వ్యవస్థ స్థితిగతులపై చర్చించడంతో పాటు దేశంలో భూ–వినియోగ మా ర్పులు, స్థిరమైన అభివృద్ధి, చిత్తడి నేలలు.. ఇలా ప్రతి పర్యావరణ వ్యవస్థకు హెల్త్‌కార్డులు రూపొందించే పద్ధతులపై చర్చిస్తున్నామని తెలిపారు.

# రాతి స్తంభాలపై శాసనాలకు రంగు తొలగింపు



పాలకొల్లు: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని పురావస్తు శాఖ అధికారులు పరిశీలించారు. ఆలయంలో బేడా మండపంలోని రాతి స్తంభాలపై ఉన్న శాసనాలపై రంగులు తొలగించాలని వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించినట్లు విజయవాడ పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ పితా సురేష్ తెలిపారు. ట్రయల్‌గా కెమికల్స్‌తో ఓ స్తంభంపై ఉన్న పెయింట్‌ను కడిగించినట్లు చెప్పారు. అలాగే బేడా మండపంలో స్తంభాల నుంచి వర్షం కారుతుందని వాటిపై ఆలయ కార్యనిర్వహణాధికారికి పలు సూచనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఏడీ కె.తిమ్మరాజు, ఏలూరు ఏఈ నల్లగోపు రాజ్‌కుమార్, ఆలయ ఈవో ముత్యాల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ స్వామి, బెజవాడ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకపఠనంతో విజ్ఞానం



విజయనగరం: పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని, విద్యార్థులు, యువత ఎక్కువగా పుస్తకాలు చదవాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. స్థానిక కేంద్ర గురజాడ గ్రంథాలయం ఆవరణలో విశాలాంధ్ర బుక్ హౌస్ జిల్లా మేనేజర్ సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో విశాలాంధ్ర బుక్ హౌస్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. మొదటిగా పుస్తకాలు ఖరీదు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర బుక్ హౌస్ పాఠకుల్లో తను కూడా ఒకరిగా పేర్కొన్నారు. పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టమన్నారు. నేటి విద్యార్థులు, యువత పుస్తకాలకు దూరమై సోషల్ మీడియాకు దగ్గరైపోయారన్నారు. ఇది అనర్థాలకు దారితీస్తుందన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు సెల్‌ఫోన్లు కాకుండా పుస్తకాలు ఇచ్చి చదవడం అలవాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండు నెలల పాటు విశాలాంధ్ర బుక్‌హౌస్ ఎగ్జిబిషన్ గురజాడ గ్రంథాలయంలో కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, పి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, జిల్లా గ్రంథాలయం కార్యదర్శి బి.లక్ష్మి, విజయనగరం తహసీల్దార్ కూర్మనాథ్, సమాచార శాఖ ఏడీ డి.రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యమే ప్రధానం



జామి: విద్యార్థుల ఆరోగ్యం కోసం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కుమరాం కేజీబీవీ పాఠశాల బాలికలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై ఏకాగ్రత కలుగుతుందన్నారు. బరువు తక్కువగా ఉన్న విద్యార్థినులకు అవసరమైతే అధిక పౌష్టికాహారం అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా వ్యాధులపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం పాఠశాలలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ భాస్కరరావు, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమకుమార్, బాలల ఆరోగ్య సురక్ష జిల్లా కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు జయశ్రీ, గంగరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ బి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పాడేరు: పరిసరాల పరిశుభ్రత బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్వచ్ఛ తాహి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పాతబస్టాండ్ అంబేద్కర్ సెంటర్ వద్ద విద్యార్థులతో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ముందుగా ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి గాంధీ జయంతి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛ తాహి కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలోని మూడు ఐటీడీఏల పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ ఈపవో అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, డీపీవో కొండలరావు, డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డీఈవో బ్రహ్మాజీరావు, డీఆర్‌డీఏ పీడీ మురళీ, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి పాల్గొన్నారు.

# శిశు సంక్షేమశాఖ పనితీరు మెరుగుపడాలి



విజయనగరం: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పనితీరు మరింత మెరుగుపడాలని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమశాఖ, అనుబంధ విభాగాల పనితీరుపై కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది పనితీరు మెరుగుపడాలని, నిర్లిప్తతను విడనాడాలని సూచించారు. ప్రగతి తక్కువగా ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి విభాగం మరింత చైతన్యం కావాల్సి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం 4.87 శాతంగా ఉన్న అతితీవ్ర పోషకాహార లోపాన్ని రెండు నెలల్లో సున్నాకు తీసుకురావాలని ఆదేశించారు. యాచక వృత్తిలో ఉన్న 19 మంది బాలలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించామని ఆ శాఖ సిబ్బంది చెప్పగా, వారి పరిస్థితిపై తనకు రెండు రోజుల్లో నివేదికను సమర్పించాలని కోరారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి పాల్గొన్నారు.

# పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

**- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్**



తిరుపతి: రుయాకు వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. రుయా అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తొలిసారిగా నిర్వహించిన సమావేశంలో తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, వర్కింగ్ కమిటీ మెంబర్ బండ్ల లక్ష్మీపతి రాయల్, ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా, మెటర్నటీ ఆస్పత్రుల వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుయా హాస్పిటల్ సూపరింటెండెంటు రవిప్రభు రుయాభివృద్ధి కమిటీ కన్వీనర్ హోదాలో అజెండా అంశాలను నివేదించారు. కమిటీలో మునుపటి సమావేశం మినిట్స్, ఆమోదించబడిన తీర్మానాలపై సమావేశంలో చర్చించారు. అందులో ఆక్సిజన్ పైపులైన్ల నిర్వహణకు ఒకనెలలోపు టెండర్లు పిలిచి ప్రక్రియ పూర్తి చేయాలని ఏపీఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను కలెక్టర్ ఆదేశించారు. తదుపరి సమావేశం సెప్టెంబర్ 27న నిర్వహించాలని, అప్పుడు అన్ని విభాగాల ప్రధాన విభాగాధిపతులు, ఇతరత్రా విభాగాల ప్రతినిధులు రావాలని నిర్ణయించారు. సమావేశంలో ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, మెటర్నిటీ సూపరింటెండెంటు డాక్టర్ పార్థసారథి రెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివరామి రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్విట్జర్లాండ్ సంస్థలతో 'అన్నమాచార్య' ఒప్పందం



రాజంపేట: స్విట్జర్లాండ్ దేశానికి చెందిన రెండు సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో-చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. తాము స్విట్జర్లాండ్ దేశంలో ప్రముఖ జ్యూరిచ్ యూనివర్సిటీతోపాటు మరో సంస్థతో ఎంవోయూ చేసుకున్నామని వెల్లడించారు. క్యూఎస్‌లో ప్రతిష్టాత్మక రంగంలో 90వ స్థానంలో జ్యూరిజ్ యూనివర్సిటీ ఉంద న్నారు. సాంకేతిక ప్రగతికి బలమైన భాగస్వామిగా నిలుస్తోందన్నారు. ఈ ఒప్పంద వల్ల ఇరు యూనివర్సిటీల మధ్య విద్యార్థులకు మార్పిడి సదుపాయం కలుగుతుం దన్నారు. వారికి విభిన్న, సాంస్కృతిక, విద్యా అనుభవాలను అందిస్తుందన్నారు. పరిశోధనల మార్పిడి ద్వారా ఇరు విద్యాసంస్థల ప్రగతికి తోడ్పాటు అవుతుందన్నారు. మౌలిక పరిశోధనలు జరుగవచ్చునన్నారు. అధ్యాపకుల మార్పిడి కూడా ఈ ఒప్పందంలో ఒక ముఖ్యాంశమన్నారు. నూతన ప్రాజెక్టులకు కలిసి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా అన్నమాచార్య యూనవర్సిటీ అంతర్జాతీయ గుర్తింపు పొందే అవకాశం ఉంటుందన్నారు. స్విట్జర్లాండ్ యూనివర్సిటీ ఒప్పందంపై ఏయూ చాన్స్‌లర్ చొప్పాగంగిరెడ్డి, ఏఐటీఎస్ అధినేత చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ హర్షం వ్యక్తంచేశారు.

# వంట నూనె దుకాణాలపై దాడులు



ఏలూరు: ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని వంట నూనెల దుకాణాలపై విజిలెన్సు, పౌర సరఫరా, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అమ్మకపు ధర నమోదు చేయకపోవడం, నిల్వల్లో వ్యత్యాసాలు, వేర్వేరు ధరలు ముద్రించడం వంటి అంశాలను గుర్తించి ఆయా వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేశారు. ఏలూరు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వీ శ్రీరాంబాబు ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు చెప్పారు. ఏలూరు నగరంలోని గాధంశెట్టి వెంకట సుబ్బారావు హోల్‌సేల్ ఆయిల్స్ నందు నూనె నిల్వలు తనిఖీ చేసి అందులో 15 కేజీల ఆయిల్ డబ్బాలపై అమ్మకపు ధర నమోదు చేయని కారణంగా షాపు యజమానిపై లీగల్ మెట్రాలజి అధికారులు కేసు నమోదు చేశారు. నూజివీడు పట్టణంలో శ్రీ విజయలక్ష్మి ఎంటర్ ప్రైజస్, హోల్‌సేల్ ట్రేడర్స్‌లో తనిఖీ చేయగా నిల్వలలో వ్యత్యాసం గుర్తించి తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. తాడేపల్లిగూడెం పట్టణంలో రోహిణి ట్రేడర్స్, రో హిణి ఎంటర్ ప్రైజస్, హోల్ సేల్ ఆయిల్ ట్రేడర్స్‌లో తనిఖీ చేయగా నిల్వలలో వ్యత్యాసం గుర్తించారు. తణుకు పట్టణంలో వరలక్ష్మి జనరల్ స్టోర్స్, ఆయిల్ ట్రేడర్స్, ప్యాకింగ్ యూనిట్ అయిన మెస్సర్స్ గణేష్ ఆగ్రో ఆయిల్ ఇండస్ట్రీస్‌లో నూనె నిల్వలు తనిఖీ చేసి అందులో ఒకే రకమైన ఆయిల్ పాకెట్లపై వేర్వేరు ధరలను గుర్తించి షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. భీమవరం పట్టణంలో కారుమూరి వెంకటేశ్వరరావు అండ్ సన్, ఆయిల్, కిరాణా మర్చంట్‌లో నూనె నిల్వలు తనిఖీ చేసి అందులో 15 కేజీల ఆయిల్ డబ్బాలపై అమ్మకపు ధర నమోదు చేయని కారణంగా, తూనికల కాటాపై సంబందిత ముద్ర లేని కారణంగా షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్సు డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, డీఈ పీ.శ్రీనివాసన్, సీఐ పీ.శివరామకృష్ణ, ఏఈఈలు టీ.శ్రీనివాసరావు, ఎం.రూపేష్ వర్మ, ఎం.అనిల్ బాబు, ఏజీ పీ.శ్రీధర్, తహసీల్దార్ బీ. కన్యాకుమారి, ఏఓ పీ సురేష్, ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, పౌర సరఫరా అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు పరికరాల పంపిణీ



భామిని: నీతిఆయోగ్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఆశావహ బ్లాక్‌ల పథకం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు అభివృద్ధి పరిచేందుకు చేపట్టిన పథకాల అమలులో దక్షిణ భారతదేశంలోనే భామిని మండలం అగ్రభాగంలో నిలిచిందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ప్రశంసించారు. ఈ మేరకు భామిని మండల కేంద్రంలో 75వ సామాజిక్ అధికారితా శివిర్స్ ప్రోగ్రాంలో దివ్యాంగులకు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో కలిసి అధునిక పరికరాల పంపిణీని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఏస్పిరేషన్ ప్రోగ్రాంలో 6 పారామీటర్ల సర్వేలో భామిని అగ్రభాగాన నిలిచిందని హర్షధ్వానాల మధ్య తెలిపారు. ప్రభు త్వ పథకాల అమలులో ఆశావహం నుంచి ఆదర్శంగా మారాలని పిలుపునిచ్చారు. భామినిని ఏపీలో చివర మండలం కాదు, ఒడిశా నుంచి మొదటి మండలంగా భావించాలన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం కింద పరిసరాల పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ చిన్న మండలంలో నీటి పథకాలు మరుగున పడి రైతులకు సాగునీరు అందడం లేదన్నారు. జిల్లాల విభజనలో బురుజోలకు చెందిన 44 మంది రైతుల భూ పరిహారాలు అందలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : 98853 15759, RNI.NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com